క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో అభివృద్ధి పనులను వేగంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో 16, 11 వార్డుల్లో జరుగుతున్న పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ 16వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. సుమారు రూ. 17.50 లక్షల వ్యయంతో 210 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే 11వ వార్డులో సీసీ డ్రెయిన్‌ను రూ.5 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కాసర తులసీరెడ్డి, ఉగ్గం దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, కాసర బన్నీ తదతరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 2 ద్వారా కార్మికులను రోడ్డున పడేస్తోందని మండిపడుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు రేలంగి నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాంట్రాక్టు ఆప్కాస్ విధానానికి తీసుకువచ్చారని, కనీసం వేతనాలైనా సకాలంలో ఏదో విధంగా వచ్చేవన్నారు. కాని కూటమి ప్రభుత్వంలో నేడు పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఆప్కాస్ నుంచి బయటకు తెచ్చే ఆలోచన చేస్తే, సదరు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు దోహదం



గవరవరంలో విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడతాయని వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరేట్ పేర్కొన్నారు. శనివారం గవరవరంలోని వెంకటపతి రాజు విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని డాక్టర్ సతీష్ నరహరిశెట్టితో కలిసి ప్రారంభించారు. సైన్స్ ఫెయిర్‌లో దాదాపు మూడు వందల మంది విద్యార్థులు సాంకేతిక పరికరాలతో తమ ఆలోచనలను ప్రదర్శించడాన్ని ఆయన అభినందించారు. విద్యార్థులకు నమూనాల తయారీపై శిక్షణను అందించడానికి తమ వంతు కృషి చేస్తామని మాజీ జెడ్పీటీసీ ఎస్ఆర్ఆర్ సుభద్ర దేవి, మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు పేర్కొన్నారు.

మద్దిలో పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం జరిపారు. అనంతరం భక్తులు స్వామిని అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ద్వారకాతిరుమల ప్రధాన అర్చకులు పెద్దింటి రాంబాబు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు, ఈవో మాణికల రాంబాబు ఆలయ మర్యాదలతో స్వామివారి శేషవస్త్రాలు ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చింతలపూడి నుంచి వయా కాంతంపాలెం, వెంకటాపురం, వెంకటాద్రి గూడెం, గణిజర్ల మీదుగా రాఘవపురానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్‌కు, ఏలూరు డిపో సూపరింటెండెంట్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ రూట్‌లో బస్సు సర్వీసు లేక ప్రజలు, విద్యార్థులు, వాణిజ్య, కూరగాయల పంటల రవాణాకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై డీపీటీఓ స్పందిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని, మార్చి ఎనిమిది తర్వాత బస్సు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. నాయకుల మన్నవ కృష్ణ చైతన్య, తోర్లపాటి బాబు, బండి వెంకటేశ్వరరావు, చేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిగులు భూముల మాటేంటి?

- నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలిస్తున్న ప్రభుత్వం
- ముంపు లేని భూములకు చెల్లించని పరిహారం
- మిగులు భూముల విషయమై పట్టించుకోని అధికారులు
- తమ పరిస్థితిపై గిరిజన రైతుల ఆందోళన



కుక్కునూరు మండలంలో ముంపునకు గురికాని భూమి (ఫైల్)

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో నిర్వాసిత గ్రామాలకు ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లింపు జరిగిన నేపథ్యంలో ఇక పునరావాస కేంద్రాలకు నిర్వాసితులను తరలించడమే తరువాయి అని చెబుతున్న ప్రభుత్వం, అధికారులు మిగులు భూముల సంగతి ఏం చేస్తారని నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురవుతున్న భూములను సర్వే చేసిన ప్రభుత్వం 2017వ సంవత్సరంలో భూ పరిహారం చెల్లించింది. కుక్కునూరు మండల వ్యాప్తంగా సమారుగా 22 వేల ఎకరాల విస్తీర్ణం గల సాగు భూమి ఉండగా ముంపు పేరుతో, గిరిజనులకు భూమికి, భూమి అందించే నిమిత్తం మండల వ్యాప్తంగా సుమారుగా 9 వేల ఎకరాల భూమిని సేకరించి పరిహారం చెల్లించింది. అయితే భూసేకరణలో కేవలం ముంపునకు గురవుతున్న భూములకు మాత్రమే ప్రభుత్వం పరిహారం చెల్లించడంతో ముంపు లేని భూములు అలానే ఉండిపోయాయి. గిరిజన రైతులు స్థానికంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కాలనీల్లోనే ఉంటున్నారు. కనుక వారు ఆ భూములను సాగు చేసుకునేందుకు ఎటువంటి ఇబ్బంది లేదు. కాని గిరిజనేతర రైతులు తమ మిగులు భూములు సాగుచేసుకునేందుకు వారిని జంగారెడ్డిగూడెం మండలంలోని చల్లవారిగూడెం పునరావాస కాలనీలకు తరలిస్తుండడంతో తమ పరిస్థితి ఏంటా అని దిక్కుతోచని స్థితిలో గిరిజనేతర రైతులు తలలు పట్టుకుంటున్నారు. మిగులు భూముల విషయమై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఇంతవరకు వారి వద్ద నుంచి ఎటువంటి సమాధానం రాలేదని రైతులు వాపోతున్నారు. కాగా నిర్వాసితులను వచ్చే జూన్ కల్లా పునరావాస కాలనీలకు తరలించేందుకు యత్నాలు సాగుతున్న నేపథ్యంలో మిగులు భూముల విషయమై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందా అని నిర్వాసిత గిరిజనేతర రైతులు ఎదురుచూస్తున్నారు. అంతేకాక నిర్వాసిత రైతుల మిగులు భూములకు కూడా పరిహారం చెల్లించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలి



రాష్ట్ర భవిష్యత్తు కోసం సర్వం త్యాగం చేసి ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని తెంచుకొని పునరావాస కాలనీలకు వెళ్లేందుకు సిద్ధమైన నిర్వాసితులకు ప్రభుత్వం అరకొర సాయం అందించి పంపించడం సరికాదు, ఇకనైనా ప్రభుత్వం మండలాన్ని యూనిట్‌గా తీసుకోని పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలి.

– కొన్నె లక్ష్మయ్య, సీపీఐ నాయకుడు, కుక్కునూరు

మిగులు భూములకు పరిహారం అందించాలి



మా గ్రామం 41.15 కాంటూర్ పరిధిలో ఉండడంతో ప్రభుత్వం మా గ్రామానికి ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లించింది. నాకు ఇంకా ముంపునకు గురికాని భూమి 3 ఎకరాలు ఉంది. ఆ భూమికి ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. మరి మమ్మల్ని పునరావాస కేంద్రాలకు తరలిస్తే ఆ మూడెకరాల భూమి వదిలి వెళ్లిపోవాల్సిందేనా. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి.

– పగిళ్ల ప్రసాద్, నిర్వాసితుడు, కివ్వాక

అధికారిపై చర్యలుండేనా?

కుక్కునూరు: మండలంలోని చిరవెల్లి గ్రామానికి చెందిన నిర్వాసితుడికి జమ అయిన ఆర్అండ్ఆర్ పరిహారం విషయంలో ఓ జిల్లా స్థాయి అధికారి నిర్వాసితుడికి ఫోన్ చేసి స్థానికంగా అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుడి వద్దకు వెళ్లి సెటిల్ చేసుకోవాలని సూచించినట్టు వచ్చిన ఆరోపణలు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. ఏదైనా ఫిర్యాదు వస్తే బాధితులను కార్యాలయానికి పిలిచి న్యాయం చేయాల్సిందిపోయి రాజకీయ నాయకుడి వద్దకు వెళ్లమని సలహా ఇవ్వడమేంటని మండల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులు ప్రజలకు సేవ చేయడానికా లేక రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి సెటిల్‌చేసుకోమని ఉచిత సలహాలివ్వడానికా అంటూ చెవులు కొరుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికి వచ్చిన ఆరోపణలే నిజమైతే ఉన్నతాధికారులు సదరు అధికారిపై చర్యలు తీసుకుంటారా లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విషయాన్ని నీరుగారుస్తారా అన్నది వేచి చూడాలని మండల వాసులు వ్యాఖ్యానిస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు



జగ్గవరపు జానకిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు



అలవాల ఖాదర్‌బాబురెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు



మిరియాల దిలీప్, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు



శానంపూడి ధర్మారావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు



వడిత్య కోట్లు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు



కనుమ రెడ్డి చండీప్రియ, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు

పార్టీ నేతల్లో జోష్ నింపిన సంస్థాగత పదవుల నియామకం

చింతలపూడి: వైఎస్సార్ సీపీతోపాటు అనుబంధ విభాగాల్లో ఈసారి చింతలపూడి నియోజకవర్గానికి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. శుక్రవారం విడుదల చేసిన పార్టీ జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవుల్లో పలువురు పార్టీ నాయకులకు పదవులు దక్కాయి. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డిని నియమిస్తూ తాడేపల్లి పార్టీ కార్యాలయం నుంచి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా చింతలపూడి మండలానికి చెందిన పలువురు పార్టీ నేతలను నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడిగా మిరియాల దిలీప్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడిగా అలవాల ఖాదర్‌బాబు రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శానంపూడి ధర్మారావు (కాంతారావు), నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వడిత్య కోట్లు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కనుమరెడ్డి చండీప్రియ నియమితులయ్యారు.

6న చలో విజయవాడ జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 6వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి అన్ని మున్సిపాలిటీల నుంచి పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ పిలుపునిచ్చారు. శనివారం యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమం పిలుపులో భాగంగా ఈ నెల 24 వ తేదీన స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని, 28వ తేదీన అన్ని రాజకీయ పక్షాలు కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, మార్చి 3వ తేదీన చలో కలెక్టరేట్, 6న చలో విజయవాడ కార్యక్రమాలు రూపొందించడం జరిగిందని చెప్పారు. ఆయా కార్యక్రమాలను కార్మికులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. మున్సిపల్ వర్కర్స్ గౌరవ అధ్యక్షుడు జంపన వెంకట రమణరాజు మాట్లాడుతూ మున్సిపల్ ప్రభుత్వ ఉద్యోగ కార్మికులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగ కార్మికులు వలె అప్కాస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

రాజబాబుకు తెలంగాణ మాజీ మంత్రి నివాళి



రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న తెలంగాణ మాజీ మంత్రి ప్రసాద్

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబుకు, తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాద్ శనివారం నివాళులర్పించారు. ముందుగా ఆయన సీహెచ్ పోతేపల్లిలోని రాజబాబు నివాస గృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను, ఆయన కుమారుడు సంజయ్‌ను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ తదితరులున్నారు.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి



జీలుగుమిల్లిలో ఆట వస్తువులను ప్రదర్శిస్తున్న సీడీపీఓ తదితరులు

బుట్టాయగూడెం: జ్ఞాన జ్యోతి ప్రాజెక్టులో 3–6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 120 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఏలూరు తులసి తెలిపారు. జీలుగుమిల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా మారేందుకు పూర్వ ప్రాథమిక విద్యకు అవసరం ఎంతో ఉందన్నారు. ఈ శిక్షణలను అంగన్‌వాడీ కార్యకర్తలు సక్రమంగా వినియోగించుకుంటూ అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించే విధంగా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చయ్య, డీఆర్‌పీలు రవిబాబు, సీహెచ్ విద్యాసాగర్, సూపర్‌వైజర్లు బి.లక్ష్మీదేవమ్మ, సీహెచ్ వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథ పితామహుడు పద్మశ్రీ నాజర్‌కు నివాళి



లక్కవరం శాఖా గ్రంథాలయంలో నాజర్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: లక్కవరం గ్రంథాలయ శాఖ ఆవరణలో బుర్రకథ పితామహుడు పద్మశ్రీ నాజర్ వర్ధంతి కార్యక్రమం సీనియర్ బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుర్రకథల ద్వారా నాటి ప్రజలను చైతన్య పరిచిన మహనీయుడు నాజర్ అని కనకరావు కొనియాడారు. సినీ కళాకారుల కన్నా ముందుగానే పద్మశ్రీ పొందిన ఘనత రంగస్థల కళాకారుడు నాజర్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, టీవీఎస్ రాజు, తడికమళ్ళ రామకృష్ణ, షేక్ ఫకీర్, వీరమల్ల మధు తదితరులు పాల్గొన్నారు.

కన్నిగంటి వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి



కన్నిగంటి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధుడు, పుల్లరి ఉద్యమ నేత కన్నెగంటి హనుమంతు వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మేకల అన్నవరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కన్నెగంటి 103వ వర్ధంతి మెయిన్ రంగా విగ్రహం వద్ద కాపు నేత చోడిపిండి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పుల్లరి ఉద్యమంతో ప్రజల్లో చైతన్యం కలిగించి స్వాతంత్ర ఆకాంక్షను నలుదిశలా వ్యాపింపజేసిన ఘనత హనుమంతుకు దక్కిందని అన్నారు. అల్లూరి సీతారామరాజు సైతం కన్నెగంటి హనుమంతు తనకు స్ఫూర్తి అనడం హనుమంతు స్వాతంత్ర్య దీక్షా దక్షతకు దర్పణంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా కన్నెగంటి చిత్రపటానికి అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులతో కలసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. మంతెన సోమరాజు, నూకల రాము, తాడిగడప ఆంజనేయరాజు, సంకు మధు, ముదునూరి రామకృష్ణంరాజు, గోలిశెట్టి శ్రీను, గొలిశెట్టి ప్రసాద్, పారేపల్లి శ్రీనివాస్, వీరవరపు నివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్ హడావుడి

ద్వారకాతిరుమల: పోలీసులు కోడి పందేలపై దాడి చేయడంతో ఒక రౌడీ షీటర్‌కు రెచ్చిపోయాడు. మా వాళ్లనే పట్టుకుంటారా అంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హడావుడి చేశాడు. ఎస్సై టి.సుధీర్ వార్నింగ్ ఇవ్వడంతో అతడు అక్కడి నుంచి జారుకున్నాడు. ద్వారకాతిరుమల మండలం సూర్యచంద్రరావుపేటలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్సై సుధీర్, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేసిన పోలీసులు, రూ. 21,110 నగదు, 4 బైక్‌లు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. తన వాళ్లను విడిపించుకోవడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన రౌడీ షీటర్ అక్కడ రెచ్చిపోయాడు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీబాలుర హైస్కూల్‌లో పోలవరం నియోజకవర్గ క్రీడాపోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. వాలీబాల్‌లో పోటీల్లో ఎన్ఆర్‌పాలెం విజేతలు కాగా, అంతర్వేదిగూడెం విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. కబడ్డీ పోటీల్లో కేఆర్‌పురం, లక్కవరం, ఖోఖోలో రాజవరం, కేఆర్‌పురం, త్రోబాల్ రాజవరం, చేగొండిపల్లి విద్యార్థులు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారని ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీడీ ఎల్. జయరాజు తెలిపారు. విజేతలకు హెచ్ఎం లోవ కుమారి బహుమతులు అందజేశారు. ఏలూరులో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో విజేతలు పాల్గొంటారన్నారు. బహుమతులు ఏర్పాటు చేసిన వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్ మణికుమార్‌ను సత్కరించారు.

సుందరగిరిపై మహాగణపతి లక్ష మోదక హోమం





యాగశాలలో మహాగణపతి లక్ష మోదక హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం, హోమగుండం వద్ద కొలువైన మహాగణపతి

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ కనకవల్లీ సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో జరుగుతున్న మహాగణపతి లక్ష మోదక హోమం శనివారంతో ఘనంగా ముగిసింది. అతి రుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృశింహ 31వ మహా యజ్ఞంలో భాగంగా కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో పండితులు రెండు రోజులపాటు ఈ హోమ క్రతువును అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా గర్భాలయంలో కొలువైన నారసింహునికి పండితులు, రుత్వికులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం యాగశాలలో హోమగుండం వద్ద పూజాధికాలను జరిపారు. ఆ తరువాత వేద మంత్రోచ్ఛరణలతో హోమగుండంలో వివిధ రకాల దినుసులను వేస్తూ, మహాగణపతి లక్షమోదక హోమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. మహా యజ్ఞ క్రతువుకు ముందు జరిపే ఈ మహాగణపతి లక్షమోదక హోమం పరిసమాప్తం అయినట్టు యజ్ఞ పర్యవేక్షకులు సీహెచ్ కుటుంబరావు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ, కలశస్థాపన వంటి పలు కార్యక్రమాలను జరుపుతామని ఆయన పేర్కొన్నారు.

సేమ్ టు సేమ్



కామవరపుకోట: కవల పిల్లలతో పాఠశాల ఉపాధ్యాయులు



జంగారెడ్డిగూడెం: ప్రతిభ పాఠశాలలో నిర్వహిస్తున్న కవలల దినోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం కవలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఉన్న 14 జతల కవలలు అందరూ కేక్ కట్ చేసుకుని మిఠాయిలు పంచుకొని ఆటపాటలతో గడిపారు. ప్రతిభ పాఠశాల డైరెక్టర్ కాసర సుభాష్ రెడ్డి, ప్రిన్సిపాల్ సరోజారెడ్డి పాల్గొన్నారు.

కామవరపుకోట: రావికంపాడు జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన శనివారం కవలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న కవలలను ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షిప్తంగా..

జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు లభించింది. ఈ నెల 13, 14 తేదీల్లో కళాశాలను సందర్శించిన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ టీమ్ కళాశాలలోని వివిధ శాఖలను సందర్శించి, వివిధ కమిటీల రిపోర్టులను, కళాశాల పరిసరాలను పరిశీలించారు. 21న నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ బెంగుళూరు వారిచే కళాశాలకు బి+ గ్రేడ్ ఇవ్వటం జరిగింది. ఐదేళ్లపాటు కళాశాలకు ఈ గ్రేడు కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.ప్రసాద్ బాబు తెలిపారు. కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చేవిధంగా కృషిచేసిన ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.మట్టా మధు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డా.కే.ఉత్తమ్ సాగర్‌కి అభినందనలు తెలియజేశారు.

పారిశుద్ధ్య పనులు

కొయ్యలగూడెం: పరింపూడిలో పారిశుద్ధ్య పనులు నిర్వహించినట్లు సర్పంచి ముప్పిడి విజయకుమారి తెలిపారు. గ్రామ కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ చెత్త సేకరించారు. తడి చెత్త, పొడి చెత్తల గురించి అవగాహన కల్పించడంతో పాటు వర్మీ కంపోస్టు చేసుకునే విధానంపై అధికారులు ప్రజలకు వివరించారు.

బాలంకు పరామర్శ

ద్వారకాతిరుమల: గుణ్ణంపల్లికి చెందిన గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు బాలం వెంకటేశ్వరరావు తండ్రి భరతయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పెదవేగి మండలం వేగివాడలో ఉన్న వెంకటేశ్వరరావును శనివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ నేతలు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, దాసరి రాంబాబు, కుక్కల గట్టియ్య ఉన్నారు.

పశువుల మృతితో కలకలం

కుక్కునూరు: కిష్టారం గ్రామంలో శనివారం కడుపు ఉబ్బుతో పశువులు మృతి చెందాయి. నకిరికంటి రాజేష్‌కు చెందిన రెండు గేదెలు, అదే కాలనీకి చెందిన మరో ఇద్దరు పాడిరైతులకు చెందిన ఆవు, గేదె, దూడ మొత్తం ఐదు పశువులు ఉదయం మేతకు వెళ్లొచ్చిన అనంతరం ఉన్నట్టుండి కడుపు ఉబ్బి గిలగిలా కొట్టుకుంటూ మృతి చెందాయని బాధితులు తెలిపారు. గేదెలకు వైద్యం అందించేందుకు వెటర్నరీ ఆసుపత్రిలో వైద్యుడు కాని, మందులిచ్చే నాథుడే లేరని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డ్రైవర్ తప్పిదమే కారణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో రెండో నెంబర్ ప్లాట్ ఫారం పైకి ఈ నెల 21వ తేదీన ఆర్టీసీ బస్సు దూసుకువెళ్లిన ఘటనకు డ్రైవర్ తప్పిదమే కారణమని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆల్ట్రా డీలక్స్ బస్సు ప్లాట్‌ఫారంపైకి దూసుకెళ్లిన ఘనటపై తమ సాంకేతిక బృందం క్షుణ్ణంగా తనిఖీ చేసి వాహనంలో ఎటువంటి యాంత్రిక సమస్యలూ లేవని, బ్రేకులు కూడా సరిగ్గానే పని చేస్తున్నాయని గుర్తించినట్టు చెప్పారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

ద్వారకాతిరుమల: కోడిగూడెం, సూర్యచంద్రరావుపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో 16 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 22,110, 14 బైక్‌లు, 3 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.